# మధ్య తరగతి

నేను, శ్రీమతి, బాబు రోడ్డు మీద నడుస్తున్నాం. బాబుకు అయిదేళ్ళు . శ్రీమతి నాకు కుడి పక్కన ఉంటే బాబు నా ఎడమ చేతి చిటికెన వేలు పట్టుకుని నడుస్తున్నాడు. దారిలో వాడికి బుడగ కొన్నాము. ఓ చేత్తో అది పట్టుకున్నా నా ఎడమ చేతి చిటికెన వేలు మాత్రం వాడు మరో చేత్తో గట్టిగా పట్టుకునే ఉన్నాడు.

నేను శ్రీమతితో కబుర్లు చెబుతున్నాను. ఉన్నట్లుండి బాబు నా ఎడమ చేతి చిటికెన వేలు వదిలిపెట్టాడు. ఆ విషయం నేను గుర్తించడానికి కొద్ది సెకన్లు పట్టింది.

“బాబేడి?” అని పక్కకు చూసేసరికి వాడు కనిపించలేదు. ఈలోగా కెవ్వుమన్న కేక ఒకటి వినిపించింది. అది నా శ్రీమతిది.

బాబు చేతిలోని బుడగ ఎగిరి రోడ్డు మీద పడింది. బాబు బుడగ కోసం రోడ్డు మీదకు పరుగెత్తాడు. సరిగ్గా అప్పుడే శరవేగంతో ఒక ట్రక్కు వస్తోంది. ఆ దృశ్యం చూసే శ్రీమతి కెవ్వుమని కేక వేసింది.

నేను పరిగెత్తాలనుకున్నాను. నా కాళ్ళు కదలలేదు.

చెప్పాలంటే ఆ స్థితిలో బాబును రక్షించడం ఇంచుమించు అసాధ్యం. బాబును రక్షించాలనుకున్న వాళ్ళు కూడా ఆ ట్రక్కు క్రింద నలిగి పోతారు.

మాకు ఒక్కగానొక్క కొడుకు. పురుడు కష్టం కాగా శ్రీమతికి ఆపరేషన్ కూడా

చేసేశారు.

ఈ ఆలోచనలన్నీ ఒకే ఒక్క సెకన్లో నా మెదడులో తిరిగాయి. అదే సెకన్లో మరో అపూర్వం కూడా జరిగిపోయింది.

ఓ వ్యక్తి మెరుపును మించిన వేగంతో రోడ్డు మీద బాబును అందుకొని పక్కకు వెళ్ళిపోయాడు. అతడు ట్రక్కు కింద పడిపోయాడనే నేను అనుకున్నాను. కానీ ట్రక్కు వెళ్ళిపోగానే అతడు, బాబు నాకు కనిపించారు.

"ఏడుకొండలవాడా, వెంకటరమణా..సమయానికి నా బాబును రక్షించావుతండ్రీ!" అంది శ్రీమతి.

"అతడి పేర్లు నీకెలా తెలుసు"? అంటూ ఉత్సాహంగా నేనూ అటు వైపు నడిచాను. అప్పుడు నా కాళ్ళు కదలగలిగినాయి.

ముందు శ్రీమతి బాబును ఎత్తుకొని విపరీతంగా ముద్దులాడింది. నేనా దృశ్యాన్ని సంతృప్తిగా చూస్తున్నాను. కానీ బాబు ఏడుస్తున్నాడు.

"ఏడవకమ్మా..దెబ్బలేం తగల్లేదుగా!" అన్నాను.

"నా బుడగ...బుడగ పోయింది.." అన్నాడు బాబు.

అదీ వాడి ఏడ్పుకి కారణం.

అప్పుడు నేను బాబును రక్షించిన వ్యక్తి వైపు చూశాను.

నవమాసాలుమోసి కన్నతల్లి, వాడి కోసమే బ్రతుకుతున్నాననుకొనే కన్నతండ్రి.. ప్రాణభయంతో ముందడుగు వేయలేని క్షణంలో ప్రాణాలకు తెగించి బాబును కాపాడిన ఆ మహత్తర వ్యక్తికి వంటి మీద చొక్కా లేదు. ఓ చిరుగుల కాకి లాగు ఉంది. కానీ ఆ లాగును గుడ్డగా ఉపయెగించాలంటే విడిగా గోచీగా కూడా ఉపయోగించదు. వంటి మీద పుళ్ళు లేవు కానీ కుళ్ళు ఉంది.

అయినప్పటికీ ఆ క్షణంలో నాకా వ్యక్తి మహాత్ముడిలాగే అనిపించాడు. "మా ఆవిడ చెప్పినట్లు నీ పేరు ఏడుకొండలవాడు, వెంకటరమణ. సమయానికి మా బాబును రక్షించావు.." అన్నాను.

"నా పేరు అప్పన్న..." అన్నాడు ఆ వ్యక్తి.

రోడ్డు మీద జనం ఎవరి హడావుడిలో వారున్నారు.

"అప్పన్నా..నాతో మా యింటికి రా.. నీతో మాట్లాడాలి.." అన్నాను.

అతనికేదైనా ప్రత్యుపకారం చేయాలనిపించింది.

"అలాగే బాబూ.." అన్నాడు అప్పన్న.

కానీ ఇంటికెలా వెళ్ళాలి?

అక్కణ్ణించి మా యింటికి బస్సులు లేవు. సాధారణంగా మేము రిక్షాలో పోతాం. కానీ ఇప్పుడు అప్పన్న కూడాఉన్నాడు. రెండు రిక్షాల్లో వెళ్ళవచ్చును. కానీ - అప్పుడు శ్రీమతీ

బాబూ ఓ రిక్షాలో కూర్చుంటే నేను, అప్పన్న ఇంకో రిక్షాలో పక్క పక్కన కూర్చోవాలి. ఇప్పుడున్న అవతారంలో అప్పన్నను నా పక్కన కూర్చోబెట్టుకొనడం ఎలా సాధ్యపడుతుంది?

అందుకని శ్రీమతినీ, బాబునూ రిక్షాలో పంపించి, నేనూ అప్పన్నా నడిచి ఇల్లు చేరాం. దారిలో నేను అప్పన్న గురించి వివరాలు తెలుసుకున్నాను.

అతడికి నా అన్న వాళ్లెవ్వరూ లేరు. ఒకోసారి కూలి పని చేస్తూంటాడు, ఒకోసారి అడుక్కుంటాడు. ఎలాగో అతడికి రోజులు వెళ్ళిపోతున్నా యి. అతడిలాంటి వాళ్ళే అతడికి కొందరు స్నేహితులున్నారు. వారిలో కొందరు ఆడవాళ్లూ ఉన్నారు. అప్పన్న పెళ్ళి చేసుకోలేదు. ఎందుకంటే మరో అప్పన్నను భూమ్మీదకు తీసుకురావడం ఇష్టంలేక!

అతడిని ఇంటికి తీసుకుని వెళ్ళి కడుపు నిండా భోజనం పెట్టి పది రూపాయలిచ్చి, ఓ జత బట్టలిద్దామని నేనకున్నాను.

ఇద్దరం ఇల్లు చేరాం. అనుకున్న ప్రకారం మా యింట్లో అప్పన్నకు సత్కారం జరిగింది.

"ఇదంతా ఎందుకు బాబూ?" అన్నాడు అప్పన్న.

"మాకు పుత్రభిక్ష పెట్టావు. ఎంత చేసినా నీ ఋణం తీరదు..."

"నిజంగా మీరలాగనుకుంటున్నారా బాబూ.." అన్నాడు అప్పన్న.

"అవును.." అన్నాను.

అప్పన్న ఏమీ మాట్లాడకుండా నవ్వి ఊరుకున్నాడు. ఆ నవ్వులో ఏదో వింత అర్థం గోచరించింది...."ఎందుకలా నవ్వావు?" అన్నాను.

"నేనిలా చాలాసార్లు చాలా మందిని ప్రాణాలకు తెగించి కాపాడాను బాబూ! అంతా ఇలాగే నా ఋణం తీర్చుకోవాలనుందన్నారు. తీరా నా కోరిక చెబితే తిట్టి పొమ్మన్నారు.." అన్నాడు అప్పన్న.

ఏదో అనబోయి ఆగిపోయాను. అప్పన్న మనసులో ఏదో కోరిక ఉందా? ఏమిటా కోరిక?

"నీ మనసులోని కోరికేమిటో చెప్పు. నా శక్తికి మించనిదైతే తప్పక తీరుస్తాను.." అన్నాను.

అప్పన్న నిట్టూర్చి.. "నాది చాలా చిన్న కోరిక. కానీ ఇంతవరకూ జరిగిందాన్ని బట్టి అది చాలా పెద్ద కోరికేమోననిపిస్తోంది..." అన్నాడు.

నా కుతూహలం పెరిగింది.. "నా దృష్టిలో కూడా నీది చిన్న కోరికే అయితే అది తప్పక తీరుస్తానని మాటిస్తున్నాను. చెప్పు!" అన్నాను.

అప్పన్న వెంటనే చెప్పలేదు. చాలాసేపు తటపటాయించి.. "మీరేమి అనుకోకండి. మీరు వల్లకాదన్నా నేనేమీ అనుకోను. మీలాంటి వాళ్ళింట్లో ఒక్క రోజంటే ఒక్కరోజు గడపాలనుంది.." అన్నాడు.

అప్పన్న కోరికేమిటో ముందు నాకు సరిగ్గా అర్థం కాలేదు. అతడు వివరించి చెప్పాక కూడా నా బుర్ర పనిచేయడానికి కాసేపు పట్టింది.

ఒక రోజంతా అప్పన్న మా యింట్లో ఉంటాడు.

అతడు మా స్నానాల గదిలో మేము ఉపయోగించే సబ్బు, తువ్వాలు ఉపయోగించి స్నానం చేస్తాడు. మా యింట్లో వాళ్ళకి తగ్గస్థాయి బట్టలు వేసుకుంటాడు. మాతోపాటు మాలో ఒకడిగా కలిసి భోంచేస్తాడు. మేమంతా కలిసి హోటలకు వెడతాం, సినిమా చూస్తాం, ఏ స్నేహితులింటికైనా పార్టీకి వెడతాం.

ఒక్కరోజు...ఒక్కరోజంటే ఒక్కరోజు...

ఇది నా కర్థమయ్యాక నేను నివ్వెరబోయాను.

అప్పన్నను రిక్షాలో నా పక్కన కూర్చోపెట్టుకుందుకే మనసొప్పలేదు. అతణ్ణి నా తమ్ముడిలాగో, నా బావమరిదిలాగో ఒక్క రోజైతే మాత్రం ఎలా చూడగలను? అప్పన్న అది చాలా చిన్న కోరిక అనుకుంటున్నాడు. అది నిజంగా చిన్న కోరికే కూడా! కానీ నా చుట్టూ ఉన్న సమాజం ఆ కోరికను చాలా పెద్దదిగా చేసింది.

''మీరు అడిగారని చెప్పాను కానీ మీరు తీర్చగలరని నేననుకో లేదు. సెలవిప్పించండి బాబూ!'' అన్నాడు అప్పన్న.

అప్పుడు అప్పన్న ఉన్నత స్థానంలోకి వెళ్ళి నన్ను మన్నించినట్ల యింది. నా అహానికి చురుక్కుమంది.

''ఒక్క నిముషం ఆగు..'' అన్నాను. అని లోపలకు వెళ్ళాను.

విషయం శ్రీమతికి చెప్పాను. శ్రీమతి మండిపడింది. నేను నిదానంగా ఆలోచించ మన్నాను. ఏ అభ్యంతరం చెప్పాలో తెలియక ఆమె..''మనింట్లో తనకు అందినదేమైనా పట్టుకుపోవాలని వాడి దొంగెత్తై ఉంటుంది'' అంది.

''కోరిన వరాలిచ్చినందుకు ఏడు కొండలవాడే నిలువు దోపిడీలు తీసుకుంటున్నాడు. ఆ క్షణంలో అప్పన్న మన బాబును రక్షించి ఉండకపోతే ఎత్తు ధనం పోసినా, ఏడు కొండలెక్కినా బాబు ప్రాణాలు నిలబడేవి కాదు. అప్పన్న మనింట్లోంచి ఎంత తీసుకునిపోతే అంతా నేను నీకు ఎలాగో అలా సంపాదించి తెస్తాను. మన ఇంటి దీపాన్ని ఆరిపోకుండా ఆపిన అప్పన్న మనసులోని ఒకే ఒక్క కోరికను మనం తీర్చలేకపోతే ఏ జన్మలోనో వాడికి బిడ్డలుగా జన్మించి ఆ ఋణం తీర్చుకోవాల్సుంటుంది..'' అన్నాను.

ఏ జన్మలోనూ అప్పన్న బిడ్డ కాకూడదన్న కోరిక వల్లనో ఏమో.. శ్రీమతి వెంటనే నా మాటలకు ఒప్పుకుంది.

''నేను సర్వస్వతంత్రుడినన్నది నా భ్రమ. నీ అంగీకారం లేనిదే ఏమీ చేయలేను..'' అన్నాను.

శ్రీమతి వెంటనే..''మీరు చెప్పిందానికి అంగీకారాన్నివ్వడంలోనే నా స్వతంత్రమున్నదని నాకు తెలుసు'' అన్నది.

ఆమె తెలివైనది.

అప్పన్నకు మా అంగీకారం చెప్పినప్పుడు అతడి కళ్ళలో ఆనందానికి బదులు ఆశ్చర్యం, అనుమానం తొంగిచూశాయి.

సాటి మనిషిని ఇంట్లో మనిషిగా ఆదరించడానికి ఎన్ని ఇబ్బందులు? ఈ ఇబ్బందులను మనిషి సృష్టించాడా? లేక అతడొక సమాజాన్ని సృష్టిస్తే అందులోంచి వాటంతటవే పుట్టుకువచ్చాయా?

ఏమైతేనేం.. నా కారణంగా అప్పన్న కోరిక తీరుతున్నందుకు నాకు గర్వంగా ఉంది.

"రేపు పొద్దున్నే అయిదింటికి వస్తాను బాబూ! ఆ మర్నాడు పొద్దున్నే అయిదింటికల్లా వెళ్ళిపోతాను." అన్నాడు అప్పన్న. నేనెంత బలవంత పెట్టినా రాత్రికి అతడుండలేదు.

మర్నాడు ఉదయం మేము మంచి నిద్రలో ఉన్న సమయంలో అప్పన్న మా యింటి కాలింగ్ బెల్ మ్రోగించాడు.

అప్పన్న కోసం శ్రీమతి వేరే టవలు, సబ్బు సిద్ధం చేసి ఉంచింది.

నేనే వెళ్ళి తలుపు తీశాను. అప్పన్న ఇంకా మురికిగానే ఉన్నాడు.

"పద..స్నానం చేద్దువుగాని" అన్నాను.

"లేవగానే - మీరు స్నానం చేస్తారా బాబూ!" అన్నాడు.

అప్పుడు నాకు గుర్తుకొచ్చింది. అప్పన్నకు ముఖం కడుక్కునేందుకు బ్రష్షూ అవి కొనలేదు. ముందు అతడిచేత ముఖం కడిగించాలి.

బ్రష్ ఇవ్వకపోతే అప్పన్నకు తేడా చేసినట్లే అవుతుంది. అందుకని నా బ్రష్, టంగ్ క్లీనర్ అతడికిచ్చాను. అతడు తొలిసారిగా పేస్టూ బ్రష్షూ ఉపయోగిస్తున్నాడట. వాష్ బేసిన్ దగ్గర నానా హడావిడీ చేశాడు. అతడికి వీధి కుళాయిల దగ్గరా, సందుల్లోనూ ముఖం కడుక్కోవడం అలవాటు. అందువల్ల అప్పన్న వాడిన నీళ్ళు కానీ, అతడు వేసిన ఉమ్ములు కానీ వాష్ బేసిన్ కే పరిమితం కాలేదు. ఆ గదంతా చిందాయి. అప్పన్న నాలిక గీసుకుంటూ పెద్ద ఆర్తనాదాలు చేశాడు. ఆ హడావుడికి శ్రీమతి, బాబు లేచిపోవడమేకాక పక్కింటినించి ఒకాయన వచ్చి 'మీ యింట్లో ఎవరికేనా ఏమైనా అయిందా' అని మరీ వెళ్లాడు.

అప్పన్నను స్నానానికి వెళ్ళమన్నాను. నేను ముఖం కడుక్కోవడం చూసి వెడతానన్నాడు. శ్రీమతి బ్రష్, టంగ్ క్లీనరూ ఉపయోగించి నేను ముఖం కడుక్కున్నాను.

"ఈ వ్యవహారం ఎంత నాజూగ్గా జరిగిందీ?" అన్నాడు అప్పన్న ఆశ్చర్యంగా. అతడికీ నాకూ ఆ విషయంలో ఉన్న తేడా అప్పన్న గుర్తించాడు. అతడికి బాధ కూడా ఉన్నట్లుంది. అప్పుడతడు స్నానానికి వెడుతూ.."ముందు మీరు స్నానం చేయండి. మీ దగ్గర్నుంచి మీ పద్ధతి నేర్చుకుంటాను.." అన్నాడు.

"ఒకళ్ళు చూడకుండానే స్నానం చేయడం మా పద్ధతి" అన్నాను.

"అదెలా సాధ్యం?" అన్నాడు అప్పన్న ఆశ్చర్యంగా.

''ఇందులో సాధ్యానికేముంది? గదిలో స్నానం చేస్తాం. తలుపులు వేసుకుంటాం.''

''ఓహో..గదిలో స్నానం చేస్తారు కదూ''అన్నాడు అప్పన్న గొణుక్కుంటూ..''మా ఆడాళ్ళు కూడా వీధిలోనే స్నానం చేస్తారు. అయినా ఉండడానికే ఇల్లు లేనివాళ్ళకి స్నానానికి గదులెలాగొస్తాయి..''

అప్పన్నకు స్నానం ఎలా చేయాలో చెప్పాను. పూర్తిగా బట్టలు తీసివేసి షవర్ విప్పుకుని వళ్ళంతా కాసేపు నాననిచ్చి అప్పుడు సబ్బుతో రుద్దుకోమని చెప్పాను. షాంపూ ఎలా వాడాలో చెప్పాను. షవర్లోంచి వేణ్ణీళ్ళకూ, చన్నీళ్ళకూ కంట్రోల్స్ ఎలా ఉన్నాయో చూపించాను (మాకు గ్రీజరు ఉందిలెంది!).

అప్పన్న తలుపులు వేసుకుని స్నానం చేసి వచ్చాడు. గదిలోంచి బయటకు రావడానికి అతడికి అరగంట పట్టింది.

''స్నానం ఇంత సుఖంగా ఉంటుందని నాకు తెలియదు..'' అన్నాడు అప్పన్న.

అతడిప్పుడు నేనిచ్చిన లుంగీ కట్టుకుని ఉన్నాడు.

స్నానాల గదిలో షాంపూ సీసా సగానికి సగం ఖర్చయింది. కొత్త సబ్బు సగానికి సగం అరిగిపోయింది. గదంతా నానా ఛండాలమూ అయిపోయింది. గోడల మీద మురికి చిందిన ఛాయలు, గదంతా వెంట్రుకలు...

గదినిలా చూసిందంటే శ్రీమతి డోక్కుంటుంది. నేను నా శక్తి మేరకు స్వయంగా గదిని శుభ్రం చేశాను. అప్పన్న కారణమడిగితే.. ''మేము స్నానం చేయడానికి వెళ్ళేముందెలా గుంటుందో, స్నానాల తర్వాత కూడా గది అలాగే ఉంటుంది..'' అన్నాను.

అప్పన్న చిన్నబుచ్చుకున్నాడు కానీ ఏమీ అనలేదు.

అప్పన్నను బలవంతం పెట్టి చొక్కా వేయించాను. అతడికి బయటే చొక్కా వేసుకుంటే బాగుండదట. ఇంట్లో కూడా చొక్కా ఎందుకూ అనడిగాడు. అది మా పద్ధతి అని చెప్పాను.

కొత్త లుంగీ మీద ఇస్త్రీ చొక్కా వేసుకుని తలకు నూనె రాసుకుని నున్నగా దువ్వుకునేసరికి అతడి రూపు కాస్త మారింది. ముఖంలో కొద్ది గానూ, భాషలో పూర్తిగానూ సంస్కారం తక్కువైంది. అతడిప్పుడు వెనుకటి అప్పన్నలా లేడు.

శ్రీమతి నాకూ, అప్పన్నకు కాఫీ యిచ్చింది. అప్పన్న కాఫీ రుచి చూసి ''నీ యమ్మ.. చాలా బాగుందండీ..'' అన్నాడు.

శ్రీమతి అక్కణ్ణించి వెంటనే వెళ్ళిపోయింది. అప్పన్నతో నేను. ''అలా మాట్లాడ కూడదు. దేన్నైనా మెచ్చుకునే పద్ధతి అది కాదు..'' అన్నాను.

అప్పన్న మాట్లాడలేదు. పెద్దగా చప్పుడుచేస్తూ పీల్చుకుంటూ కాఫీ తాగే పద్ధతి చూస్తుంటే నాకు కడుపులో తిప్పింది. అతడిది పూర్తి అయ్యేదాకా నేను ఆగాను. అది అప్పన్న గమనించాడు. అటుపైన నేను కాఫీ తాగే పద్ధతి గమనించాడు. అతడి కళ్ళలో ఆశ్చర్యం కనపడింది.

తరువాత టిఫిను.

ఇడ్లీ సాంబార్...శ్రీమతి వండిన సాంబారంతా ఒక్క అప్పన్నే తాగేశాడు - అదీ పెద్దగా చప్పుడు చేస్తూ. అతడు తింటున్నప్పుడు శ్రీమతి అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

''ఎలాగుంది?'' అన్నాను.

మెచ్చుకునేందుకు అప్పన్న ధారాప్రవాహంగా బూతులు వాడాడు. ఆ భాష అర్థంకాక బాబు ఆశ్చర్యంగా అతడి వంక చూశాడు.

బాబును వెళ్ళిపొమ్మనమని అప్పన్నకు బూతు పదాలు వాడ కూడదని చెప్పాను. అయితే అతడికి తను వాడే పదాల్లో బూతులేవో మంచివేవో తెలియవు. వివరించి చెప్పడానికి నాకు మొహమాటం వేసింది. అది సంసారుల కొంప...

ఇద్దరం తెలుగు వాళ్ళమే అయినా అతడి భాష వేరు. నా భాష వేరు. ఈ విషయం నేనిప్పుడు గుర్తించాను. నిత్యజీవిత వ్యవహారంలో నాకు నిషిద్ధమైన పదాలు అతడికి వాడుక పదాలు.

నేనెంత బలవంతపెట్టినా శ్రీమతి మరీ అలిగి భోంచేయలేదు. అయితే తేడా జరిగినట్లు అప్పన్నకు తెలియలేదు. అదే మా పద్ధతేమోననుకున్నాడు.

భోజనాల దగ్గర నములుతూ అప్పన్న చేసే చప్పుడు..డిస్కో సంగీతంలో డ్రమ్‌బీట్సు వెనుక నుంచి వినపడే మువ్వల చప్పుడులా ఉన్నప్పటికీ ఆ సమయంలో మనోహరంగా లేదు. నాకు అన్నం సహించ లేదు.

భోంచేశాక..''కళ్ళు మూసుకుపోతున్నాయి బాబూ!'' అన్నాడు అప్పన్న. అతడికి శుభ్రమైన పక్క ఏర్పాటు చేశాను. వెడల్పైన మడత మంచం - దాని మీద మెత్తటి రొజాయి. ఓ ఇస్త్రీ దుప్పటి, ఫోం తలగడా!

అప్పన్న మంచం మీద ఇలా పడుకున్నాడో లేదో అలా గుర్రు ప్రారంభించాడు. అతడికి వళ్ళు తెలియని నిద్ర పట్టిందని గ్రహించాక నేను శ్రీమతితో వెళ్ళి మళ్ళీ ఆమెతో కలిసి భోంచేశాను.

''కోరి తెచ్చుకున్న తద్దినంలాగుంది'' అంది శ్రీమతి.

''తప్పు..అలాగనకూడదు...''

''ఏమో.. అసలు అతనుపయోగించేలాంటి భాషే ఉపయోగించి అతణ్ణి తిట్టాలన్నంత ఆవేశం కలుగుతోంది నాలో..'' అన్నది శ్రీమతి.

''నాకైతే బాధగా ఉంది. ఒకే దేశంలో మధ్య తరగతికీ అలగా జనానికీ ఇంత తేడా? మనని చూసి డబ్బున్న వాళ్ళు కూడా ఇలాగే అనుకుంటారేమో?'' అన్నాను.

నాకు మంచి ఇల్లుంది. మంచి ఫర్నిచరుంది. డబ్బిచ్చే సౌఖ్యాలున్నాయి. కానీ నేను మధ్యతరగతివాడిని. ఎందుకంటే నాకు నెలకు ఇంత అని ఆదాయం వస్తుంది. అందులోంచి కొన్ని త్యాగాలు చేస్తేనే ఈ సదుపాయాలు. నాకు దురలవాట్లు లేవు. శ్రీమతి పొదుపరి.

కానీ డబ్బున్నవాళ్ళయితే అలా కాదు. తమ సదుపాయాల కోసం వాళ్ళే త్యాగాలూ చేయనవసరం లేదు.

'మా ఇంటోన్లే అప్పన్న కిలా ఉంది. ఉన్నవాళ్ళ ఇంట్లో వాడికెలా ఉంటుందో'.. అనుకున్నాను.

"మీరలాగనుకుంటున్నారు. మన పద్ధతులన్నీ ఉన్నవాళ్ళ తరహాయే! డబ్బొక్కటిలేదు తప్పితే, మనకూ వాళ్ళకూ ఇంకే తేడా లేదు." అంది శ్రీమతి.

డబ్బొక్కటే పెద్ద తేడా అని నేను శ్రీమతితో అనలేదు. ఈ అవకాశాన్ని తీసుకుని .."అయితే మనం శశాంక ఇంటికి వెడదామా ఈ రోజు..." అన్నాను.

"ఈ రోజా! ఈ రోజైతే అప్పన్నను కూడా తీసుకుని వెళ్ళాల్సుంటుంది.." అంది శ్రీమతి భయంగా.

"ఈ రోజైతేనే లాభం. ఎందుకంటే ఎవరైనా అడిగితే అప్పన్న మనింట్లో పనివాడని చెప్పవచ్చు. అతడు మన బాబును కూడా బాగా చూస్తాడు. మనకూ గొప్పగా ఉంటుంది.'

"ఈ అయిడియానే నాకు తట్టలేదు. అటు అప్పన్నను పెద్ద పార్టీకి తీసుకెళ్ళినట్లూ ఉంటుంది - అతడికి మన బట్టలు కట్టబెడతాం కాబట్టి అలాంటి వాడు నౌకరంటే హోదా పెరుగుతుంది.." అంది శ్రీమతి.

ఈలోగా దబ్బున పెద్ద శబ్దమయింది. ఇద్దరం కంగారుగా లేచి అప్పన్న పడుకున్న చోటుకు వెళ్ళాం. అప్పన్న మంచం మీద లేడు. క్రింద పడ్డట్లున్నాడు. కానీ అతడికి నిద్రా భంగం కాలేదు. వళ్లు తెలియకుండా అలాగే ఆదమరిచి నిద్రపోతున్నాడు.

అతడినలాగే నిద్రపోనిచ్చాం, సాయంత్రం నాలుగింటిదాకా!

అప్పుడతణ్ణి లేపాను.

మళ్ళీ అప్పన్న స్నానం చేశాడు. కాఫీ తాగాడు. చప్పుడు చేస్తూ అతడు నా వంక చూసి...'నీయమ్మ..మీకులా చప్పుడు చేయకుండా తాగడానికి మహా ఇబ్బందిగా ఉంది..' అని నాలిక్కరుచుకున్నాడు.

అప్పన్నకు నా బట్టలు ఇచ్చాను. అవి అతడికి బాగానే సరిపో యాయి.

రాత్రి ఎనిమిదింటికి వాళ్ళింటికి వస్తున్నట్లు శశాంకకు ఫోన్ చేశాను.

శశాంక ఆ ఊళ్ళో పేరున్న వ్యాపారస్తుడు. అతడికీ నాకూ పరిచయం కావలసిందికాదు. శశాంక భార్య నా శ్రీమతికి క్లాస్‌మేట్. అదే మా పరిచయం. ఆమె అప్పుడప్పుడు మా యింటికి వచ్చి వెడుతూంటుంది. ఆ దంపతులు కూడా రెండు సార్లు మా యింటికి కార్లో వచ్చి వెళ్లారు. వాళ్ళింటికి వచ్చివెళ్ళమని బలవంతం చేశారు.

శశాంకది పెద్ద భవనం. రోజూ రాత్రి ఎనిమిదింటికి విధిగా వాళ్లింట్లో విందు జరుగుతూంటుంది. దానికి నగరంలోని పెద్దపెద్ద వాళ్ళు వచ్చి వెడుతూంటారు. వాళ్ళ మధ్య ఇమడలేమని భయపడి శ్రీమతే అక్కడకు వెళ్ళవద్దంటూంది. అప్పన్నకూ మాకూ తేడా ఉన్నట్లే ఉన్న వాళ్ళకూ మాకూ తేడా ఉండవచ్చునని నేననగానే శ్రీమతికి పౌరుషం వచ్చి ఈ ప్రయాణానికి ఒప్పుకుంది.

అప్పన్నను తీసుకుని ఇంట్లోంచి ఆరింటికి బయల్దేరాం. అతడు బాబును నడిపించడానికి వీల్లేదని తనే ఎత్తుకున్నాడు.

అంతా కలిసి హోటలుకు వెళ్లాం.

"పార్టీకి వెళుతున్నామన్నారుగా హోటలుకెందుకూ?" అన్నాడు అప్పన్న.

"మా పద్ధతులన్నీ చూస్తానన్నావుగా.. అందుకని."

నా అసలు అభిప్రాయం అదికాదు. అప్పన్నకు కడుపు నిండా తిండి పెట్టిస్తే ఆ పార్టీలో కక్కుర్తిగా అన్నీ తినేయకుండా ఉంటాడని నా ఆశ.

హోటల్లో అప్పన్న నాలుగు దోశలు, రెండు ఊతప్పాలు, ఎనిమిది ఇడ్లీలు తిన్నాడు. నేను అతడి తిండి పుష్టిని మెచ్చుకున్నాను.

"అస్తమానం కోరినంత తిండి దొకరదు బాబూ! అందుకని దొరికినప్పుడు ఎంతైనా తినేస్తాను..." అన్నాడు అప్పన్న మామూలుగా.

పరిసరాలకు అనుగుణంగా ప్రతి జీవి తనను తాను మలచుకుంటుందని శాస్త్రం చెబుతున్నది. అప్పన్నలాంట వాళ్ళు ఎడారిలో ఒంటెల్లా తమ శరీరంలో ఆహారాన్ని నిలువుంచుకోగల్గుతారేమో! అయితే పార్టీలో కూడా అంత తిండీ తినేసి అప్పన్న నా పరువు తీసేయడు కదా అని నాకు భయం వేసింది. శ్రీమతితో మాత్రం అనలేదు.

శశాంక ఇంట్లో జరగే పార్టీ ఎలా ఉంటుందో చెప్పి అక్కడెంత జాగ్రత్తగా మసలుకోవాలో నేను అప్పన్నకు చెప్పాను.

అప్పన్న శ్రద్ధగా నేను చెప్పింది విని తలూపాడు. పార్టీలో కూడా పాపం నన్నే గమనిస్తూ బుద్ధిగా మసలుకున్నాడు.

శశాంక ఇంట్లో పార్టీ మనం సినిమాల్లో చూసే పెద్దవాళ్ళ పార్టీలాగుంది.డిన్నరు వద్ద అప్పన్న నా గురించి అంతులేని నిగ్రహం చూపి నా పరువు నిలబెట్టాడు. అతడు నాకు నౌకరని చెప్పుకోవాల్సిన అవసరం రాలేదు.

కాసేపయ్యాక ఆడవాళ్ళూ మగవాళ్ళూ వేర్వేరు హాల్సులోకి వెళ్ళిపోయారు.

"ఇది డ్రింక్స్ సమయం" అన్నాడు శశాంక.

అప్పుడు రాత్రి పదిన్నరయింది.

"నేను తాగను" అన్నాను.

"డోంట్ క్రియేటే సీన్" అన్నాడు శశాంక. అక్కడ కాదనడం అమర్యాద. తాగడమే మర్యాద.

నా భయమంతా అప్పన్న గురించి. అసలే అలగా మనిషి. తాగేడంటే వాడెలా తయారౌతాడోనని నా భయం.

కానీ అక్కడ నేను అసహాయుడినయ్యాను.

అప్పన్న తాగనే తాగాడు.

క్రమంగా అక్కడి వాతావరణంలో రాబోయే మార్పు ప్రారంభమయింది. ఒక్కొక్కళ్ళూ మత్తుగా తాగుతున్నారు. తాగడంలో ఒకరితో ఒకరు పోటీలు పడుతున్నారు.ఆ పోటీల్లో అప్పన్న కూడా దిగాడు. వాడు కూడా కడుపా, చెరువా అన్నట్లు తాగుతున్నాడు.

ఆ ఒక్క కారణంగా అంతా అప్పన్న చుట్టూ చేరారు. వాడిచేత తాగిస్తున్నారు. తామూ

తాగుతున్నారు.

నేను మాత్రం ఎవరేమనుకున్నాసరేనని తాగలేదు. అంతా ఇంచుమించు బలవంతంగా తాగించడానికి ప్రయత్నించి విఫలులై నన్ను తిట్టడం మొదలుపెట్టారు. భాషలో సంస్కారం లేదు.

అప్పన్న వాగుడు మొదలు పెట్టాడు. అది సంస్కారం లేని భాష.

తను చూసిన సినిమా తారల్నీ, పార్టీకి వచ్చిన ఆడవాళ్ళనీ ఇలా ఎవరెవరి గురించో వాడు నోటికి వచ్చినట్లు పచ్చిగా మాట్లాడుతున్నాడు. చుట్టూ చేరినవారు గజల్సు వింటున్నట్లూ, షాయరీ వింటున్నట్లూ 'వహ్వా వహ్వా' అని చప్పట్లు కొడుతూ వాడిచేత ఇంకా ఇంకా పాడిస్తున్నారు. ఆ సమయంలో నాకు వాళ్ళందరూ అప్పన్నల్లాగే కనపడుతున్నారు.

రాత్రి పన్నెండింటికి అందరూ స్పృహ తప్పే స్థితిలో ఉన్నారు. వీడ్కోలు సమయం వచ్చింది.

వీడ్కోలు సమయంలో శశాంక ముద్ద ముద్దగా..''మీరీ రోజు మంచి స్నేహితుణ్ణి తీసుకుని వచ్చారు. పార్టీలకెప్పుడూ ఇతన్ని తీసుకుని రండి. పార్టీకే కొత్త కళొచ్చింది..'' అన్నాడు.

అప్పన్న తాగిన స్థితిలో ఉన్నాడు. అతడిని తీసుకుని బయటకు వచ్చాం. కేవలం అప్పన్న కారణంగా ఓ పెద్ద మనిషి మాకు ఇంటి దాకా లిఫ్టు ఇచ్చాడు.

మర్నాడు అప్పన్న మా యింట్లో సెలవు తీసుకుంటూ..''ఇంత కాలం పెద్దిళ్ళల్లో ఇమడగలనా అని భయపడేవాణ్ణి బాబూ! మీ ఇంట్లో స్నానం చేయడానికీ, ముఖం కడుక్కోడానికీ, కాఫీ తాగడానికీ, టిఫిన్ తినడానికి, భోంచేయడానికీ.. అన్నింటికీ భయమే వేసింది. నేను చిన్నవాడిననిపించింది. కానీ మీకంటే పెద్దిళ్ళలో అయితే నేను ఇమిడి పోగలను. దాన్నిబట్టి మీకంటే పెద్దవాడినా అనిపిస్తోంది. ఏమైనా నా కోరిక తీర్చారు బాబూ! ఎప్పుడైనా ఏ లాటరీలోనైనా లక్షలొస్తే నేనూ పెద్దవాళ్ళలా బ్రతగ్గలనన్న ధైర్యం వచ్చింది. వస్తాను బాబూ..మీ మేలు మర్చిపోలేను..'' అని వెళ్ళిపోయాడు.

''ఏమిటి వాడనే మాటలో అర్థం?'' అంది శ్రీమతి.

''మనం అలగా జనం అని కొందరిని తీసిపారేస్తుంటాం. అందని వాళ్ళని కొందరికి భయపడుతూ - వాళ్ళిద్దరికీ మధ్య నుండే మధ్య తరగతి వాళ్ళం మనమనుకుంటాం. కానీ అసలు సంగతేమిటంటే అటు అలగా జనం, ఇటు అందని జనం వేర్వేరు జాతుల వాళ్ళు కారు. డబ్బు తప్ప వాళ్ళ అలవాట్లలో ఇంకే తేడా లేదు. ఈ లోకంలో రెండే రెండు తరగతులు - మద్య తరగతి - అంటే మద్యం పుచ్చుకునే వాళ్ళు. మధ్య తరగతి - అంటే మనబోటి వాళ్ళు మద్య తరగతికి సంస్కారంతోటీ, భాష తోటీ, అంతస్థులతోటీ నిమిత్తం లేదు. వాళ్ళెప్పుడు ఎక్కడ కలిసినా ఏక కుటుంబంలా మసలగలరు...'' అన్నాను.

నా మాటలు కూడా శ్రీమతికి అర్థమయ్యాయో లేదో తెలియదు. కానీ మధ్యతరగతి వాళ్ళు మద్యతరగతిలో కూడా ఉంటారన్న నిజం ఆమెకు చెప్పలేదు. కనీసం నేను, నా హోదా మరి?

★

*(యువ మాసపత్రిక -- మార్చి 1985).*